# చేసిన అభివృద్ధి కండ్ల ముందే ఉన్నది

- గ్రామాల అభివృద్ధిని కాంక్షించే పార్టీలకే పట్టం కట్టండి
- ఎమ్మెల్యే జాజాల సురేందర్
- నాగిరెడ్డిపేట మండలంలో ఎన్నికల ప్రచారం



నృత్యం చేస్తూ ఎమ్మెల్యే సురేందర్‌కు స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళలు

ఎల్లారెడ్డి, నవంబర్ 19: గడిచిన ఐదేండ్లలో రెండు సంవత్సరాలు కరోనాతో ముగిసినా మిగతా మూడేండ్లలో చేసిన అభివృద్ధి కండ్ల ముందరనే కనిపిస్తున్నదని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. ఆదివారం నాగిరెడ్డిపేట మండల పరిధిలోని బొల్లారం, పల్లెబొగుడ తండా, బెజుగం చెరువు తండా, జాన్కంపల్లి, ఎర్రకుంట తండా, మెల్లకుంట తండా, మహాదేవుని గడ్డ తండాల్లో అయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. బొల్లారం గ్రామాన్ని రెండు కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి చేశామన్నారు. బొల్లారం నీటి సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. తాండూర్ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసి బొల్లారం గుట్టపై నీళ్లను స్టోర్ చేస్తే బొల్లారం పరిధిలోని ప్రతి గుంటకూ నీళ్లు పుష్కలంగా వస్తాయన్నారు. తండాలను, చిన్న చిన్న గ్రామాలను జీపీలుగా మార్చి వాటి రూపురేఖలు పూర్తిగా మార్చివేశామన్నారు. ప్రజాసంక్షేమాన్ని కోరే వారికి ప్రజలు పట్టం కడతారు కానీ, డబ్బులు వెదజల్లితే ఓట్లు రాలవన్నారు. తెలంగాణ రాకముందు, ప్రస్తుతం గ్రామాల పరిస్థితిని ప్రజలు గమనించాలన్నారు. కరెంటు కోతలు, కన్నీటి కష్టాలు, పంటలు సరిగ్గా పండక ఇబ్బందులతో అల్లకల్లోలంగా ఉండే తెలంగాణ ప్రస్తుతం ఎలా ఉందో గుర్తించాలన్నారు. సీఎం కేసీఆర్ రైతును రాజుగా మార్చే సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రైతు కుటుంబాల్లో ఆనందాన్ని నింపాడన్నారు. గాంధారి మండలం గండివేట్‌లో శనివారం రాత్రి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బీఆర్ఎస్ కార్యకర్తలను కత్తితో పొడిచారన్నారు. ఇలాంటి అరాచకాలను ప్రోత్సహించే వ్యక్తి కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తే ప్రజలు హర్షించరన్నారు. మొన్నటి వరకు గ్రూపు తగాదాలతో రెండు వర్గాలు గొడవలు పడ్డాయని, ఇప్పుడు బీఆర్ఎస్‌కు పెరుగుతున్న గ్రాఫ్‌ను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ కార్యకర్తలపై వారు దాడులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. ఏం ఆలోచించకుండా ఒక్క నిమిషంలో ఓటు వేయొద్దని, గెలిచిన వ్యక్తి చేతిలో మన భవిష్యత్తు, మన గ్రామ భవిష్యత్తు ఉంటుందనే విషయాన్ని గమనించి ఓటేయాలన్నారు. కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఆయనతో పాటు నాగిరెడ్డిపేట జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీ నారాయణ, జానకంపల్లి సర్పంచ్ దేశబోయిన సాయిలు, ఆత్మాకూర్ సర్పంచ్ బాల్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

***అభివృద్ధి కావాలా.. అరాచకం కావాలా..?***

గాంధారి, నవంబర్ 19: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే స్థానిక నాయకుడు కావాలా..? ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో గొడవలు సృష్టించే నాన్ లోకల్ నాయకుడు కావాలో ప్రజలు ఆలోచించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. గాంధారిలోని విండో కార్యాలయం నుంచి ప్రభుత్వ దవాఖాన వరకు ఆదివారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ విగ్రహం వద్ద ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కరీంనగర్ నుంచి వచ్చిన మదన్‌మోహన్‌రావు నియోజకవర్గంలో గొడవలు సృష్టిస్తున్నారని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని అన్నారు. ఆయన వచ్చిన అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలు గుండాల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గండివేట్ గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకుడు కత్తితో దాడి చేయించడం సిగ్గుచేటన్నారు. మూడు గంటల కరెంట్ ఇస్తామన్న కాంగ్రెస్ కావాలా, 24 గంటలు కరెంట్ ఇచ్చే బీఆర్ఎస్ కావాలా అని ఓటర్లను అడిగారు. గాంధారి మండల కేంద్రంలో ఐదు ఎకరాల్లో స్టేడియం నిర్మిస్తానని, రూ.మూడు కోట్లతో సంగెం, పోచమ్మ బ్రిడ్జి, రోడ్డు పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నేరేళ్ల ఆంజనేయులు, గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్, జడ్పీటీసీ శంకర్‌నాయక్, ఎంపీపీ రాధాబలరాం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శివాజీరావు, గాంధారి విండో చైర్మన్ సాయికుమార్, ఎంపీటీసీ పత్తి శ్రీను, నాయకులు ముకుంద్‌రావు, పెద్దబూరీ సత్యం తదితరులు పాల్గొన్నారు.



గాంధారిలో రోడ్‌షోలో మాట్లాడుతున్న సురేందర్



పల్లెబొగుడ తండాలో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే సురేందర్



సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

# కాంగ్రెస్‌కు ఓటేస్తే.. కటిక చీకట్లే..

- నాటి పడిగాపులు.. పాము కాట్లు వద్దంటున్న రైతులు
- 10 హెచ్‌పీ మోటర్ల చర్చతో రైతాంగంలో ఆందోళన
- రేవంత్ వ్యాఖ్యలపై సర్వత్రా నిరసన
- వ్యవసాయ బావులకు 10 హెచ్‌పీ మోటార్లా.. విద్యుత్తు ఇంజనీర్ల విస్మయం

బోధన్, నవంబర్ 19: 'ఇప్పుడు కరెంట్ తిప్పలు లేవు.. తెలంగాణ వచ్చినంక.. కేసీఆర్ పాలనలో మాకు కరెంట్ కష్టాలు తప్పినయ్.. పంటలకు 24 గంటలపాటు నాణ్యమైన కరెంట్ అందుతున్నది.. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకచ్చినయ్.. రిపేర్ల కోసం కరెంట్ ఆఫీసుల చుట్టూ.. ట్రాన్స్‌ఫార్మర్ల రిపేరింగ్ సెంటర్ల చుట్టూ రోజుల తరబడి తిరిగే తిప్పలు లేవు.. రేవంత్‌రెడ్డి 3 గంటల కరెంట్ చాలని, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతుండడంతో రైతులు గాబరా అవుతున్నరు.. కాంగ్రెసోళ్ల పాలనలో కరెంట్ కోసం పడ్డ తిప్పలు మళ్లీ రావద్దు.. అప్పుడు 9 గంటల ఉచిత విద్యుత్తు అని చెప్పి నాలుగు గంటలు ఇచ్చేవారు.. అది కూడా ఆపుకుంటూ.. ఆపుకుంటూ ఇస్తుండె.. రాత్రుళ్లు పొలాల వద్ద పడిగాపులు ఉంటిమి.. పాముకాట్లకు, కరెంట్ షాక్‌లకు మా రైతుల పాణాలు పోయినయ్..' అని రైతులు అంటున్నారు. కాగా, '10 హెచ్‌పీ మోటర్లు ఏమిటి.. ఇవేం మాటలు.. విద్యుత్తు వ్యవస్థ సర్వనాశనం అవుతుంది.. ఇప్పుడున్న ట్రాన్స్‌ఫార్మర్లను రెట్టింపు చేసుండంటే.. అంతా వృథా ఖర్చు.. మళ్లీ చీకటి రోజులు వస్తాయంటూ విద్యుత్తు నిపుణులు, ఇంజినీర్లు, రిటైర్డ్ ఇంజినీర్లు, మేధావులు అంటున్నారు. రేవంత్‌రెడ్డి ఇలా ఎందుకు మాట్లాడుతున్నారంటూ వారు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. ఇక, బోరువెల్ మెకానిక్‌లు సైతం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై నవ్వుకుంటున్నారు.. 10 హెచ్‌పీ మోటర్లు పెడితే లోవోల్టేజీతో కాలిపోతాయ్.. ఇప్పుడున్న 5 హెచ్‌పీ మోటరు స్థానంలో 10 హెచ్‌పీ మోటరు పెట్టాలంటే లక్ష రూపాయల వరకు ఖర్చవుతుంది.. ఇదంతా సాధ్యమా..' అంటూ రేవంత్‌రెడ్డిది బుర్రతక్కువ ఆలోచనలని వారు అంటున్నారు. ఇలా ప్రతి ఒక్కరూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయ రంగానికి కరెంట్ సరఫరాకు సంబంధించి చేస్తున్న రచ్చను ఘంటాపథంగా వ్యతిరేకిస్తున్నారు. 3 గంటల కరెంటూ వద్దూ.. కాంగ్రెస్ పాలన వద్దూ అంటూ రైతాంగంలో నిరసన ధ్వనులు వినిపిస్తున్నాయి.

***10 హెచ్‌పీ మోటార్ల ఖర్చు ఎవరు భరిస్తారు..?***

రైతులు బోరువెల్స్‌కు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటే మోటర్‌తో పాటు క్లాంప్‌లు, పైపులు, వైరు తదితర పరికరాల ఖర్చుతో కలుపుకుంటే రూ.లక్ష వరకు ఖర్చవుతుంది. ఈ ఖర్చు ఎవరిస్తారన్న విషయం ఏ కాంగ్రెస్ నాయకుడు చెప్పడంలేదు. ఇంత పెద్ద మొత్తం తాము ఖర్చు పెట్టలేమని రైతులు అంటున్నారు. 3 గంటల విద్యుత్తుతో ఒకేసారి లోడ్ పెరిగి మోటర్లు కాలిపోతాయని రైతులు అంటున్నారు. ఇదే విషయాన్ని బోరు వెల్ మెకానిక్‌లు చెబుతున్నారు.

***రైతుల్ని ఆగం చేసే కుట్ర..***

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి కరెంట్ సరఫరాపై చేస్తున్న వ్యాఖ్యలు రైతుల్లో గుబులు రేపుతున్నాయి. రేపటి రోజున ఏమి జరుగబోతుందోననే గాబారా రైతాంగంలో ఏర్పడింది. 3 గంటల కరెంట్‌తో పంటలకు నీరు అందుతుందా అంటూ ప్రశ్నిస్తున్నారు. 3 గంటల కరెంట్‌తో తడిపిన మడే తడుస్తుంది.. పొలం అంతటా నీరు పారదు.. దీంతో కరెంట్ ఖర్చు ఎక్కువ అవుతుంది.. రైతుకు ఫాయిదా ఉండదు.. చివరి వరకు నీరు అందకపోతే.. అప్పట్ల పొలాలు ఎండిపోయినట్టే.. ఇప్పుడు కూడా అదే జరుగుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అమ్మో.. కాంగ్రెస్ పాలన వద్దు.. మళ్లీ పాత చీకటి రోజులు వద్దూ.. అంటూ రేవంత్‌రెడ్డిని రైతులు శాపనార్థాలు పెడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ కష్టాలు తప్పవన్న నిర్ధారణకు రైతులు వచ్చారు. దీనికితోడూ పక్క రాష్ట్రంలో కర్ణాటకలో కాంగ్రెస్ పాలనలో కరెంట్ లేక రైతులు పడుతున్న పాట్లు ఇక్కడి రైతులు తెలుసుకుంటున్నారు. కర్ణాటకలో ఐదు గంటలపాటు కూడా కరెంట్ సరఫరా జరగడంలేదని అక్కడి రైతులు ఇటీవల కాలంలో ప్రపంచానికి తెలియపర్చారు. దీంతో కర్ణాటక కరెంట్ కష్టాలు మాకొద్దని రైతులు అంటున్నారు.

***మరో 54 వేల ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం..***

రేవంత్‌రెడ్డి చెబుతున్నట్లు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవడమన్నది ఆచరణ సాధ్యంకాదని విద్యుత్ ఇంజినీర్లు అంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కువగా 63 కేవీ డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఒక్కో ట్రాన్‌ఫార్మర్ కింద 12 నుంచి 15 బోరువెల్స్ ఉంటాయి. ఉమ్మడి జిల్లాలో 2 లక్షల 70 వేల బోరువెల్స్ ఉన్నాయి. జిల్లాలో 54,000 డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఇప్పుడు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాలంటే ఈ ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్య రెట్టింపు కావాలి. అంటే మరో 54,000 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలి. ఈ భారం ఎక్కడి నుంచి మోస్తారు. ఒక్కో డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అదనంగా మరో లక్ష రూపాయలు ఖర్చవుతుంది. అలాగే, సబ్ స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్యను పెంచాల్సి ఉంటుంది. అదనంగా సబ్ స్టేషన్ల ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.. ఇదంతా సాధ్యమయ్యే పనికాదని, విద్యుత్తు వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందని విద్యుత్తు నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## కరెంట్ కష్టాలు తప్పవు..



బీబీపేట్, నవబంర్ 19: సీఎం కేసీఆర్ మా కష్టాలను గుర్తెరిగి ఇబ్బందులు లేకుండా చేసిండు. 24 గంటలు కరెంట్‌తోపాటు రైతుబంధు, రుణమాఫీ చేస్తుండు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు కేవలం 3 గంటల కరెంటు సరిపోతుందని అనడం సిగ్గుచేటు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుటే దాదాపు రూ.లక్ష వరకు ఖర్చు అవుతుంది. కాంగ్రెస్ పార్టీకి పొరపాటున ఓటు వేసి మళ్లీ కష్టాలు కొనితెచ్చుకోవద్దు.

*- కుర్లా సిద్ధరాములు, రైతు, బీబీపేట్*

## కరెంటు కష్టాలు తీరాయి..



నేను 10 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. గతంలో పంటకు నీటి తడులు అందించేందుకు రాత్రుళ్లు సైతం మోటర్ వద్ద నిద్ర పోతుండె. కరెంట్ ఎప్పుడు వస్తుందో..ఎప్పుడు పోతుందో తెలియక నానా ఇబ్బందులు పడేటోళ్లం. గత ప్రభుత్వ హయాంలో సింగిల్ ఫేస్ కరెంట్ సరఫరా చేసేవారు.. అదికూడా రాత్రి పూట. వచ్చిన కొద్దిపాటి నీటితో పంటలకు సరిపోక నానా ఇబ్బందులు పడేవాళ్లం. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక 24 గంటల పాటు నాణ్యమైన ఉచిత కరెంట్ సరఫరా చేస్తున్నారు.

**-ఎడ్డెడి హన్మండ్లు, రైతు కోటగిరి**

## మూడు గంటల కరెంటుతో ఒక్క మడైనా తడుస్తదా..?



కోటగిరి నవంబర్ 19 : రేవంత్‌రెడ్డి అన్నట్లు మూడు గంటల కరెంటుతో ఒక్క మడి అయినా తడుస్తుందా..? ఈ విషయం ఆయనకు తెలుసా.. నేను ఐదెకరాల భూమిలో వ్యవసాయం చేస్తున్నా.. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న 24 గంటల పాటు ఉచిత విద్యుత్‌తో నాణ్యమైన పంటలు పండించుకుంటున్నాం. కాంగ్రెసోళ్ల మాటలతో మళ్లీ తిరిగి పాత రోజులే వస్తాయంటేనే భయం వేస్తోంది. అప్పట్ల రాత్రి పూట కరెంటుతో పొలాలకు పరుగులు పెట్టేవాళ్లం.. అనాడు కష్టాన్ని చూశాం. ఈనాడు సౌలభ్యాన్ని చూస్తున్నాం.

**-హంగర్గా రాములు,రైతు కోటగిరి**